నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 24 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# రైతులను వేధించొద్దు

- అటవీ చట్టాల పేరుతో ఇబ్బంది పెట్టవద్దు
- ఫారెస్ట్ అధికారులతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూన్ 23: సిర్పూర్ నియోజకవర్గం లోని రైతులను అటవీ చట్టాల పేరుతో ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములను దున్నేందుకు వెళ్లగా వారిని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో రైతులు ఈ సమస్యను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రైతులతో కలిసి కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్‌ను కలిసి మాట్లాడారు. అంకుసాపూర్ గ్రామస్తులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారని, వారు కేవలం తిండి కోసం వర్షాకాలంలోనే పంట వేసి బతుకుతారని చెప్పారు. లేదంటే వారు బతకడం కష్టమని ఎఫ్‌డీవో దృష్టికి తీసుకెళ్లారు. అటవీ చట్టాల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఎఫ్‌డీవో సానుకూలంగా స్పందించి, గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్ ఈఎస్ఐ దవాఖానను సందర్శించారు. వసతులపై రోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. బీఆర్ఎస్ సిర్పూర్ మండల కన్వీనర్ అస్లాం అనారోగ్యంతో సిర్పూర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండడంతో విషయం తెలుసుకొని పరామర్శించారు. ప్రభుత్వ దవాఖానలో కరెంట్ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జనరేటర్ ఉన్నా పనిచేయడం లేదని, కరెంట్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో 24 గంటల కరెంట్ ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోతలు తప్పడం లేదన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కరెంట్ కోతల ప్రభుత్వమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్, నాయకులు కాశిపాక రాజు, మహిళా నాయకురాలు వరలక్ష్మి, కమల తదితరులు ఉన్నారు.

## కురిసిన వర్షం.. మురిసిన రైతు

మృగశిర కార్తె ప్రవేశించగానే రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేశారు. 20 రోజులుగా వాన జాడ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సోమవారం మోస్తరుగా కురిసిన వాన వారికి ఊరటనిచ్చింది. ఆరుద్ర కార్తెలో వర్షాలతో పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని సంబురపడుతున్నారు.

- బెజ్జూర్, జూన్ 23


బెజ్జూర్ మండలంలో కుకుడలో పత్తి వేసిన భూమిలో కురిసిన వర్షం


మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేయాలని కోరుతూ ఖాళీబిందెలతో రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

- నెలరోజుల నుంచి గోసపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- అదనపు కల్టెకర్ వాహనాన్ని అడ్డుకున్న గిరిజనులు
- సమస్య పరిష్కరించాలని ఎస్ఐ కాళ్ల మీద పడి విన్నపం

# గిరిజనుల కన్నెర్ర

## మిషన్ భగీరథ నీళ్లు అందించాలని ఖాళీబిందెలతో రాస్తారోకో


ఎస్ఐ కాళ్లపై పడి వేడుకుంటున్న గిరిజనుడు

అదనపు కలెక్టర్ దీపక్ తివారీ వాహనాన్ని అడ్డుకుంటున్న గిరిజనులు



కెరమెరి, జూన్ 23: మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అధికారులపై కెరమెరి మండల గిరిజనులు కన్నెర్రజేశారు. తాగునీటి ఎద్దడి తీర్చాలంటూ సోమవారం కెరమెరి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై జోడేఘాట్, పాట్నాపూర్, బాబేఝరి, శివాగూడ, పాటగూడ, పిట్టగూడ, కొలాంగూడ గ్రామాలకు చెందిన సుమారు వంద మంది గిరిజనులు బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్ల సరఫరా లేక ఎంతో గోస పడుతున్నామని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారులకు ఇచ్చిన వినతిపత్రాలు, పత్రికల్లో వచ్చిన కథనాల ప్రతులను ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. జిల్లా అధికారులు స్పష్టమైన హామీనిచ్చే వరకు ఇక్కడి నుంచి కదలబోమని ఖాళీ బిందెలతో భీష్మించుక్కూర్చున్నారు. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో రహదారి కిక్కిరిసిపోయింది. దీంతో పోలీసులు సముదాయించే ప్రయత్నం చేసినా ఆందోళనకారులు పట్టువిడవలేదు. అనంతరం ఎస్ఐ మధుకర్ అంబులెన్స్‌ను ఆపకుండా వెళ్లనివ్వాలని కోరడంతో దారినిచ్చారు. అంబులెన్స్‌కు బదులు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ వాహనమని గ్రహించిన గిరిజనులు అడ్డుపడి విన్నవించేందుకు ప్రయత్నించారు. కాని అదనపు కలెక్టర్ వాహనం ఆపకుండా వెళ్లిపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. మరింత ఆగ్రహంతో ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ స్పందించి అధికారులతో మాట్లాడిస్తానని చెప్పగా.. 'సారూ నీ కాళ్మొక్తాం మాకు నీళ్లందేలా చూడాలె' అంటూ ఇద్దరు గిరిజనులు ఎస్ఐ కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. సమస్య తీవ్రతను గమనించిన ఎస్ఐ అధికారులతో న్యాయం జరిగిలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నాతో ఎంతో మంది ప్రయాణికులు రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారని శాంతించాలని కోరారు. వెంటనే అక్కడి నుంచి రాస్తారోకో విరమించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు. ఆ తర్వాత నీటి సరఫరా శాఖ ఏఈ విశ్వేశ్వర్ అక్కడికి చేరుకొని రేపటి నుంచి నీళ్లు సరఫరా కాకుంటే ట్యాంకర్లతోనైనా అందించేలా చూస్తానని స్పష్టమైన హామీనివ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. ఈ నిరసనలో బాబేఝరి రాయిసెంటర్ సార్మేడి మూట ఎల్లయ్య, మాజీ సర్పంచ్ మానిక్‌రావు, గిరిజన నాయకులు సుబాష్, గోపాల్, శ్రీనివాస్, కోండు, గుండా, రాజు, తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి అర్జీల వెల్లువ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 23 : ప్రజావాణికి కార్యక్రమానికి అర్జీలు వెల్లువలా వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. సోమవారం ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. పరిష్కారం వివరాలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకు 51 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అనువైన స్థలాన్నిచూసి మొక్కలు నాటాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, అటవీ శాఖల నుంచి మొక్కలు తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఎస్పీ కార్యాలయంలో...

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం ప్రజా వాణి నిర్వహించి వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి సమస్యపై ఆరా తీసి సూచనలు అందజేశారు. సమస్యలపై మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు తదితరులు ఉన్నారు.

### మంచిర్యాల కలెక్టరేట్‌లో..

నస్పూర్, జూన్ 23 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బెల్లంపల్లి, లక్షెట్టిపేట, జైపూర్, హాజీపూర్, మందమర్రి, నస్పూర్, మంచిర్యాల ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చారు. ప్రజావాణిలో 49 అర్జీలు అందాయని, వాటిని పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని తెలిపారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

# నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి/నస్పూర్, జూన్ 23 : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు మంగళవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నది. ఈ మేరకు తెలంగాణ టెక్నికల్ బోర్డు షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్ర పాలిసెట్-25(ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించిన విద్యార్థులకు రెండు విడుతలుగా ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. విద్యార్థులకు నిర్దేశించిన తేదీల్లో హాజరుకావాల్సి ఉంటుంది. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని విద్యార్థులకు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్ లైన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ జరుగనున్నది. ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం దేవేందర్ తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

### పెరిగిన కళాశాలలు..

ఈసారి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో రెండు ప్రభుత్వ కళాశాలలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వ కళాశాలల సంఖ్య రాష్ట్రంలో 59కి చేరింది. విద్యార్థులకు సీట్లు ఎక్కువగా ఉండనున్నాయి.

### షెడ్యూల్ ఇలా..

పాలిటెక్నిక్ కళాశాలల్లో యాజమాన్య కోటా ఉండదు. వంద శాతం కన్వీనర్ కోటా కింద సీట్ల భర్తీ జరుగుతుంది. 24 నుంచి 28 వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 28న సర్టిఫికెట్ల పరిశీలన, 28 నుంచి జూలై 1 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, జూలై 1న ఆప్షన్ల ఫ్రీజింగ్, 4న సీట్ల కేటాయింపు, 4 నుంచి 6 వరకు ఫీజు చెల్లించి, కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు షెడ్యూల్ ఇచ్చారు. ఫైనల్ ఫేజ్‌లో 9 నుంచి 10 వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 11న సర్టిఫికెట్ల పరిశీలన, 11 నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 15న సీట్ల కేటాయింపు, 15 నుంచి 17 వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడం, 15 నుంచి 17 వరకు ఓరియంటేషన్ ప్రోగ్రాం, 18 నుంచి తరగతులు ప్రారంభం, 21 నుంచి 24 వరకు వరకు ఇంటర్నల్ స్లైడింగ్, 30న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని వెల్లడించారు.

# మత్తు పదార్థాలకు బానిసకావద్దు

- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్
- వికాస్‌నగర్, ఒడ్డెర కాలనీల్లో కార్డెన్ సెర్చ్

మంచిర్యాల అర్బన్, జూన్ 23: యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ సూచించారు. సోమవారం అర్ధరాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వికాస్ నగర్, ఒడ్డెర కాలనీల్లో కార్డెన్ సెర్చ్, కమ్యూనిటి కాంటాక్ట్ కార్యక్రమాన్ని ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి నిర్వహించారు. పోలీసులు ప్రతి ఇంటిని తనిఖీ చేసి అనుమానితులు, వాహనాల పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాటిని గుర్తించారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న దేశీదారు, లోకల్ లిక్కర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో డీసీపీ మాట్లాడుతూ.. సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఇసుక రవాణాదారులు మద్యం తాగి ట్రాక్టర్లు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నంబర్ ప్లేట్ లేని 11 ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, రూరల్ సీఐ అశోక్, మహిళా స్టేషన్ సీఐ నరేశ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీల్లో పట్టుకున్న మద్యాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల డీసీపీ, ఏసీపీ

# ఉత్సాహంగా ఒలింపిక్ రన్

## పాల్గొన్న కలెక్టర్లు, అధికారులు, క్రీడాకారులు

మంచిర్యాలటౌన్/నస్పూర్, జూన్ 23: అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాలలో ఒలింపిక్ రన్-2025ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ రన్‌ను మంచిర్యాల డీవైఎస్వో హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్‌దీపక్, ఏసీపీ ప్రకాశ్ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఐబీ చౌరస్తా నుంచి ఒలింపిక్ రన్ మంచిర్యాల పట్టణంలోని వీధుల గుండా క్రీడా పతాకాలతో, క్రీడాకారుల చప్పట్ల మధ్య ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేశ్, జాయింట్ సెక్రటరీ రాంచందర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, జిల్లా బ్యాడ్మింటన్ అధ్యక్షుడు ముఖేశ్‌గౌడ్, ఎస్సీ కమిషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీటీడీవో జనార్దన్, డీఆర్డీవో కిషన్, డీఐఈవో అంజయ్య , సీఐ ప్రమోద్ రావు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒలింపిక్ డే రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. ఒలింపిక్ డే రన్ జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్, కుమ్రం భీం చౌక్, అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ మీదుగా సాగింది. జిల్లా యువజన క్రీడా సర్వీసులు శాఖ అధికారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మ, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



రన్‌ను ప్రారంభిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# మెనూ పాటించడం లేదు సార్..

## నీళ్ల సాంబార్, పప్పుతోనే సరిపెడుతున్నారు

- ఇష్టమొచ్చినట్లు తిడుతూ..మా తోనే పనులు చేయిస్తున్నారు
- మంచిర్యాల ఎమ్మెల్యే, డీఈవోకు చెప్పకున్న కేజీబీవీ విద్యార్థినులు

దండేపల్లి, జూన్ 23 : మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడం లేదని, నీళ్ల సాంబార్, పప్పుతోనే సరిపెడుతున్నారని, దురుసుగా ప్రవర్తిస్తూ తిడుతున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీఈవో యాదయ్యకు కేజీబీవీ విద్యార్థులు చెప్పుకొని వాపోయారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీని సోమవారం ఎమ్మెల్యే, డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారానికోసారి మాత్రమే చికెన్ పెడుతున్నారని దాంట్లో కూడా నీళ్లు ఎక్కువ ఉంటున్నాయన్నారు. మటన్ అస్సలే పెట్టట్లేదని అన్నారు. తల్లిదండ్రులు వస్తే వారితో కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, విద్యాలయ పరిసరాలను మాతోనే శుభ్రం చేయిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాల్సింది పోయి వారిని ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని విద్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయ ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులతో పనులు చేయించడం తగదన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మర్యాదగా ప్రవర్తించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎంఈవో చిన్నయ్య, సీఆర్పీ గరిగె నర్సయ్య, తదితరులు ఉన్నారు.


దండేపల్లి కేజీబీవీకి వచ్చిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీఈవోకు సమస్యలు చెబుతున్నవిద్యార్థులు